సామాన్యుడిపై గుదిబండ

- పేద ప్రజలపై గ్యాస్ ధరాభారం
- సిలిండర్‌పై రూ.50 అదనపు పెంపు
- ఆందోళన చెందుతున్న మధ్యతరగతి కుటుంబాలు



అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న గ్యాస్ సిలిండర్లు

అంబాజీపేట: సామాన్యుడి వంటింట్లో కూటమి ప్రభుత్వం మళ్లీ మంట పెట్టింది. కొన్ని రోజులుగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది. కేంద్ర ప్రభుత్వం పేద, సామాన్య కుటుంబాల్లో గ్యాస్ మంటలు రేపింది. గృహ వినియోగ సిలండర్ ధర రూ.840 ఉండగా తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచింది. దీంతో పేద వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఉజ్వల పథకం లబ్ధిదారులకు సైతం ప్రభుత్వం కనికరించలేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింపు జేయడం గమనార్హం. ఇకపై ప్రతి 15 రోజులకు లేదా నెలకోసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో భవిష్యత్తులో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయనే సాంకేతాలు ఇచ్చినట్లయింది. ఆయిల్ కంపెనీలు ధరలు అమాంతంగా పెంచేస్తునాయని, వంట గ్యాస్ మరో రూ.50 పెరగడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వాణిజ్య సిలెండర్ ధర తమకు మోయలేని భారంగా తయారైందని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతి నెలా వంట గ్యాస్‌పై క్రమం తప్పకుండా రూ.25 పెంచిన విషయం విధితమే. కొంత కాలం వ్యవధి అనంతరం తాజాగా రెట్టింపు ధర పెంచడం కొనుగోలు దారులను కలవరానికి గురి చేసింది. కేంద్ర ప్రభుత్వ తీరుపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ధరలను నియంత్రించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ధరలు తగ్గించాలంటూ ఇప్పటికే పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు చేశారు.

రూ.2 కోట్లకు పైగా భారం

గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాలోని 11 మండలాల వ్యాప్తంగా వినియోగదారులపై నెలకు సుమారు రూ.2 కోట్ల మేర అదనపు భారం పడనుంది. ఈ 11 మండలాల పరిధిలో పలు గ్యాస్ ఏజెన్సీలు మొత్తం సుమారు 1.80 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో సుమారు 4120 వరకు వాణాజ్య పరమైనవి. మిగిలిన 1.60 లక్షల కనెక్షన్లకు ఈ పెంపు వర్తిస్తుంది. ప్రస్తుతం గృహ వినియోగానికి సంబంధించి 14.2 కేజీల గ్యాస్ సిలండర్ ధర రూ.840 ఉండగా ఇకపై రూ.890 అయ్యింది.

గ్యాస్ ధర తగ్గించాలి



సామాన్యులపై ప్రభుత్వం ఇప్పటికే కరెంటు చార్జీలతో పాటు అనేక భారాలు మోపింది. డీజిల్ పెట్రోల్ ధరలు పెరగడం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడానికి కారణమైంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా ధరలు పెంచుకుంటూ పోవడం సమంజసం కాదు.

– బుదితి సత్యనారాయణమ్మ, ఎంపీటీసీ, ఇరుసుమండ

పేదలపై తీవ్ర ప్రభావం



వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపు సామాన్య ప్రజలకు భారమవుతుంది. పేద, మధ్య తరగతి ప్రజానీకంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పటికే కొనలేని స్థితిలో ఉన్న గ్యాస్ సిలెండర్ ధర మరింత పెరగడం సామాన్యులకు ఆవేదన కలిగిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సిలెండర్ ధరలను నియంత్రించాలి.

– ఉందుర్తి నాగమల్లేశ్వరి, గృహిని, అంబాజీపేట

క్లుప్తంగా

వెంకన్న కల్యాణాన్ని ఘనంగా చేద్దాం



అంబాజీపేటలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో ఉన్న భూసమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని వచ్చే నెల 7వ తేదీ రాత్రి ఘనంగా చేద్దామని ఆలయ కమిటీ సభ్యులు నిర్ణయించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ సభ్యులు సమావేశమై కల్యాణానికి సంబంధించి కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. స్వామి కల్యాణానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వచ్చే నెల 8న స్వామివారి తీర్థం జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం స్థానిక యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేపట్టనున్నామన్నారు.

బాధితులకు సాయం



వక్కలంకలో బాధితులకు సాయం పంపిణీ చేస్తున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

అంబాజీపేట: ఇటీవల వక్కలంక చెరువు గట్టు సమీపంలో జరిగిన అగ్నిప్రమాద బాధితులు ముక్కామల సూర్యాకాంతం, కేశనకుర్తి లక్ష్మిలకు వైఎస్సార్ సీపీ నాయకులు సాయం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రేవతి, పెదబాబు, ఎంపీటీసీ పిల్లి సత్యవాణి, రమేష్ దంపతులు, గ్రామ శాఖ అధ్యక్షుడు యల్లమిల్లి జయబాబు, మట్టపర్తి బాలాజీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమకూర్చిన నిత్యావసర వస్తువులు, బియ్యంలను జెడ్పీటీసీ, పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ బూడిద, వరలక్ష్మి, మందపాటి కిరన్‌కుమార్, ఉందుర్తి నాగబాబు, దొమ్మేటి రాధా సూర్యనారాయణ, జనుపల్లి ఏడుకొండలు, మట్టపర్తి హరి, పినిపే బుజ్జి, నేదునూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

మామిడికుదురు: గ్రామీణాభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు భారీగా నిధులు మంజూరు చేస్తున్నా అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ బీజేపీ మామిడికుదురు మండల శాఖ అధ్యక్షుడు బైరిశెట్టి రామకృష్ణ గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి కుటుంబానికి తాగునీరు అందిస్తున్నారన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు వినియోగిస్తూ శిలాఫలకంపై ప్రధానమంత్రి పేరు కానీ అతని చిత్రం కానీ ముద్రించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడా కేంద్ర ప్రభుత్వం గుర్తింపు కనిపించడం లేదని మండిపడ్డారు. జల జీవన్ మిషన్ అని చిన్నగా ప్రచురిస్తున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రతి గ్రామ పంచాయతీలోను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు ఫొటోకాల్‌కు అనుగుణంగా ప్రభుత్వ కార్యక్రమాలు జరగాలన్నారు.

వేసవి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి



అంబాజీపేటలో శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఎంఈఓలు

అంబాజీపేట: ప్రాథమిక భావనలపై పట్టు సాధించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్‌లు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా విద్యాశాఖాధికారి వారి ఆదేశాల మేరకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో అన్ని సబ్జెక్టులపై వేసవి శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 నుంచి 10 తరగతులలో వెనుకబడిన విద్యార్థులకు అన్ని సబ్జెక్టులపై శిక్షణ ఇస్తారన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు ఈ శిక్షణ జరుగుతుందన్నారు. హెచ్‌ఎం కడలి సాయిరామ్, ఉపాధ్యాయులు బీఎస్ఎన్.మూర్తి, కత్తుల వెంకటేశ్వరరావు క్యాంపు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో వెన్నపు సత్యనారాయణ పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం

కొత్తపేట: వేసవి శిక్షణా తరగతుల్లో ఉత్తమ ఫలితాల సాధనకు అన్ని మెళకువలు నేర్చుకోవాలని ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కే లీలావతి విద్యార్థులకు సూచించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మండలం లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు సమ్మర్ క్యాంప్‌ను ఎంఈఓలు గురువారం ప్రారంభించారు. తొలిరోజు 62 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.సత్యనారాయణ , స్కూల్ కమిటీ చైర్మన్ కే శ్రీను, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



బాధితుడి సోదరుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి వైద్య ఖర్చుల కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.11 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ర్యాలి గ్రామానికి చెందిన తీపర్తి వెంకటేశ్వరరావు కడుపులో పేగుకు సంబంధించిన వ్యాధితో విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికే రూ.6 లక్షల వరకు ఖర్చు అయ్యిందని, ఇంకా ఖర్చు పెట్టే స్థోమత లేక స్థానిక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరారు. దీంతో రావులపాలెంలో బాధితుడి అన్నయ్య తీపర్తి భాస్కర్‌కి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.11 వేలు విలువైన చెక్కును అందజేశారు.

రాష్ట్ర ఉత్తమ పంచాయతీ అవార్డుకు ఎంపికైన పినపళ్ల



అమరావతిలో రాష్ట్ర పంచాయతీరాజ్ అధికారుల చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న సర్పంచ్ సుభాష్

ఆలమూరు: మండలంలోని పినపళ్ల గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో వివిధ కేటగిరిలకు సంబంధించి అవార్డులను ప్రవేశపెట్టింది. అందులో భాగంగా పేదరిక నిర్మూలన, జీవనోపాధి విభాగంలో పినపళ్లకు ఈ అవార్డు వరించింది. దీంతో గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్ గురువారం అమరావతిలో రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్, డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ కార్యదర్శి శశి భూషణ కుమార్, రాష్ట్ర కమిషనర్ మైలవరపు కృష్ణతేజ చేతుల మీదుగా సర్పంచ్ సుభాష్, గ్రామ కార్యదర్శి షణ్ముఖ వీరరాజు సంయుక్తంగా అవార్డులను అందుకున్నారు. ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న సర్పంచ్ సుభాష్‌ను పలువురు అభినందించారు.

నిధులు, విధులతో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం

- జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు
- ఆత్రేయపురంలో ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



ఆత్రేయపురంలో పంచాయతీరాజ్ దినోత్సవ ర్యాలీ

కొత్తపేట: రాజ్యాంగ సవరణ ప్రకారం నిధులు, విధులు కల్పించినప్పుడే పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతమై స్వతంత్రంగా ముందుకు వెళుతుందని ఆత్రేయపురం జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు అన్నారు. జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ఎంపీపీ పెన్మెత్స బంగార్రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బోనం సాయిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ చట్టం 1993 ఏప్రిల్ 24వ తేదీ నుంచి అమలులోకి వచ్చిందని, దీని ప్రకారం పంచాయతీలను బలోపేతం చేయడానికి 29 అధికారాలు బదలాయించారని తెలిపారు. అటువంటి పంచాయతీ పాలనకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. అనంతరం ర్యాలి నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఇన్‌చార్జి ఎంపీడీఓ యు చంద్రశేఖర్, మండల పరిషత్ ఏఓ వీ రామస్వరూప్, ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వెలుగు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరం: పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీఓ కె.విజయ ప్రసాద్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వేతనం రూ.26వేలకు పెంచాలి

అయినవిల్లి: వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ అయినవిల్లి మండల ఫీల్డ్ అసిస్టెంట్ల ఎంపీడీఓ జి.భీమారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. తాము 19 సంవత్సరాలుగా ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నామన్నారు. తమను రెగ్యులర్ చేయాలని కోరారు. ఎంపీడీఓను కలిసిన వారిలో మండల ఫీల్డు అసిస్టెంట్లు యూనియన్ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ

ఆలమూరు: మండలంలోనిన్న ఆలమూరు, చొప్పెల్ల సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం గురువారం ఏర్పాటు చేసిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో కక్షిదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ట్రాన్స్‌కో రామచంద్రపురం డీఈ కె.రత్నాలరావు, టెక్నికల్ డీఈ విజయానంద్, ట్రాన్స్‌కో ఏడీఈ సీహెచ్ శ్రీధర్ నేతృత్వంలో కొత్తూరులోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, విద్యుత్ సాంకేతిక మండలి సభ్యులు సురేఖరాణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబా, ఫైనాన్స్ సభ్యులు ఎస్.సుబ్బారావు, స్వాతంత్ర్య సభ్యులు ఎస్.మురళీకృష్ణ పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మంచినీటి ట్యాంకుల ప్రారంభం

అయినవిల్లి: మండలంలోని పోట్టిలంక, కొండుకుదురు గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను ఎమ్మెల్యే గిడ్డిసత్యనారాయణ గురువారం ప్రారంభించారు. కొండుకుదు రూ.26.25 లక్షలతో నిర్మించగా, పొట్టిలంకలో రూ.43.02 లక్షలతో నిర్మించారు.

కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

రావులపాలెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రావులపాలెం డిపో నుంచి కాళేశ్వరం సరస్వతీ నది పుష్కరాల సందర్భంగా ఇక్కడ నుంచి ఆర్టీసీ సర్వీస్‌ను ప్రారంభిస్తున్నట్టు డిపో మేనేజర్ జీజీవీ రమణ గురువారం తెలిపారు. వచ్చే నెల 15 తేదీన డిపో నుంచి వరంగల్, వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప దేవాలయాల దర్శనాలతో పాటు సరస్వతీ నదిలో పుష్కర స్నానం చేసేలా ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ తెలిపారు. పై క్షేత్రాల దర్శనం అనంతరం మే 17న బస్సు రావులపాలెం చేరుతుందన్నారు. టిక్కెట్ వెల రూ.2200 మరిన్ని వివరాలకు, అడ్వాన్స్ టిక్కెట్ల కోసం డిపో మేనేజర్ 99592 25537, అసిస్టెంట్ మేనేజర్ 73829 11871, బస్ స్టేషన్ ఎంక్వైరీ 9959225549 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పలువురికి శ్రీనివాసరావు పరామర్శ

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మామిడికుదురు మండలంలో గురువారం పలువురిని పరామర్శించారు. నానమ్మ మృతితో బాధపడుతున్న నగరానికి చెందిన మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు నూర్జైన్‌ను, రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందిన బోణం బాలరాజు కుటుంబ సభ్యులను, భార్య, తండ్రి వియోగంతో బాధపడుతున్న మగటపల్లికి చెందిన దళిత నేత కలిగితి పళ్లంరాజును, మాతృ వియోగంతో బాధపడుతున్న జర్నలిస్ట్ బోయి రాంబాబును శ్రీనివాసరావు పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయింపు

రావులపాలెం: మండలంలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారులు ఆర్.నాగకుమార్, బి.శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. ఈమేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈనెల 28వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే సమయంలో వారి నివాసానికి ఒక కిలోమీటర్ పరిధిలోని వివిధ పాఠశాలలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. ఒక కిలోమీటర్ పరిధిలో లేకుంటే మూడు కిలోమీటర్ల పరిధిలో ఎంపిక చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు దారులు గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000, పట్టణ ప్రాంతంలో రూ.1,44,000 వార్షిక ఆదాయానికి మించి ఉండకూడదన్నారు. అర్హులైన వారికి దరఖాస్తు విషయంలో గ్రామ సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్ సహాయం తీసుకోవచ్చునన్నారు. అనాథలు, హెచ్ఐవీ ఎఫెక్టెడ్, దివ్యాంగుల వారికి ఐదు శాతం. ఎస్సీలకు 10 శాతం. ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీలకు, ఇతరులకు 6 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన హెల్ప్ డెస్క్‌ను మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు ఎం.రాజేంద్రప్రసాద్, సీఆర్‌ఎంటీ 9059583609 ఈ నంబరులో సంప్రదించాలన్నారు.

కొత్తపేట: ప్రైవేటు పాఠశాలలో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించనున్నట్టు ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ తెలిపారు. మరిన్ని వివరాలకు విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ సూర్యప్రకాష్‌ను 9441429588ను సంప్రదించాలని సూచించారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

కొత్తపేటలో జర్నలిస్టుల నిరసన, రెవెన్యూ, పోలీస్ అధికారులకు వినతి పత్రాలు



కొత్తపేటలో ఎస్సై సురేంద్రకు వినతిపత్రం సమర్పిస్తున్న విలేకరులు

కొత్తపేట: ప్రస్తుతం విలేకరులు, పత్రిక కార్యాలయాలపై జరుగుతున్న దాడులు అరికట్టి పత్రికా స్వేచ్ఛను కాపాడాలి అని ప్రభుత్వాన్ని కోరుతూ గురువారం కొత్తపేటలో జర్నలిస్టులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వైస్ ప్రెసిడెంట్ జగత రాంబాబు ఆధ్వర్యంలో ఏపీయూడబ్ల్యూజే, ప్రెస్‌క్లబ్ సభ్యులైన నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ ఏలూరు జిల్లా సాక్షి కార్యాలయంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఆయన అనుచర వర్గం దాడి చేసి కార్యాలయంలో కంప్యూటర్లు ధ్వంసం చేయడమే కాక, విధి నిర్వహణలో ఉన్న రిపోర్టర్‌పై దాడి చేయడం దారుణమన్నారు. సాక్షి పత్రికలో వ్యతిరేక వార్త వచ్చిందని కార్యాలయంపై దాడి చేయడం, కార్యాలయ పరికరాలు ధ్వంసం చేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. పత్రికలో వచ్చిన వార్తల్లో వాస్తవాలు కాదనుకుంటే దానికి వివరణ ఇవ్వాలే గానీ ఈ విధంగా కార్యాలయం, విలేకరులపై దాడులకు పాల్పడడం తగదన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి, పత్రికా స్వేచ్ఛను కాపాడాలన్నారు. పాత్రికేయులు పత్రికా కార్యాలయంపై దాడులు అరికట్టాలని కోరారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి దాడులకు నిరసనగా నినాదాలు చేశారు. అక్కడ ఏఓకు, అలాగే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సై జీ సురేంద్రకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే సభ్యులు అడపా ప్రసాద్, నామాల ఏసురాజు, కొవ్వూరి ఆదినారాయణరెడ్డి (ఆదిరెడ్డి), కొత్తపేట ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మట్టపర్తి జితేంద్రకుమార్, కోశాధికారి శ్రీఘాకోళ్లపు బాబి, జర్నలిస్టు సంఘాల సభ్యులు నామాల వెంకటేశ్వరరావు (శ్రీను), బొరుసు జానకిరామయ్య, రాయుడు జయదేవ్, చింతలపూడి రవి, ఏ శివగణేష్, గుత్తుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కుర్చీల సమర్పణ



పాళ్లమ్మ ఆలయానికి కుర్చీలు అందిస్తున్న దాత సూర్య

మామిడికుదురు: ఈదరాడ గ్రామ దేవత శ్రీపాళ్లమ్మకు అదే గ్రామానికి చెందిన యెరుబండి సూర్య పది ప్లాస్టిక్ కుర్చీలను సమర్పించారు. వీటిని ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సాధనాల సుబ్బారావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాత సూర్యను చైర్మన్ సుబ్బారావుతో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో యెరుబండి పెదఅయ్యన్న, యెరుబండి కన్నబాబు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ అమ్మవారి తీర్థం

మలికిపురం: గూడపల్లి నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద అమ్మవారికి ఆడపడుచు నిధి అనే కార్యక్రమం అమలు చేశారు. ఇందులో భాగంగా ఆడపడుచుకు వాయిన ఇస్తారు. అమ్మవారిని గ్రామ ఆడపడుచులందరూ దర్శించుకుంటారు. 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆడపడుచు నిధి కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోండి



మలికిపురంలో ప్రధాన శాఖలపై సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మలికిపురం: కేంద్ర ప్రభుత్వం నుంచి ఉపాధి హామీ నిధులు వస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించుకోవచ్చునని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రధాన ప్రభుత్వ శాఖల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ లైన్లు ట్రాన్స్‌ఫార్మర్లు, తాగునీటి సదుపాయం, కాలువల అభివృద్ధి వంటి పనులు చేయాలని సూచించారు. ఉపాధి పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. పనులను పెంచి వేతనాలు సక్రమంగా ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి, మండల ఉపాధ్యక్షురాలు కందికట్ల నిర్మళ, ఎంపీడీఓ జి. ఉమా మహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాజన్, ట్రాన్స్‌కో ఏఈ బి. ప్రసాద్, డీటీ ఎస్. శ్రీనివాస్ వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యదర్శులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి



పి.గన్నవరంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న జగ్గిరెడ్డి, గన్నవరపు



మలికిపురంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల, కోఆర్డినేటర్ గన్నవరపు
- పి.గన్నవరంలో కొవ్వొత్తుల ర్యాలీ

పి.గన్నవరం: ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని, ఉగ్రవాదులు ఎక్కడున్నా వెంటాడి ఏరివేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ, దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని స్థానిక రోడ్ల సెంటర్‌లో కోఆర్డినేటర్ గన్నవరపు ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిర్ల జగ్గిరెడ్డి, గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడి చేయడం తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇటువంటి తరుణంలో మృతుల కుటుంబాలకు దేశం అండగా ఉండాలని అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఉగ్రవాదం నశించాలని, భారతీయుల ఐక్యత వర్ధిల్లాలని పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మూడు రోడ్ల సెంటర్ నుంచి బాలబాలాజీ థియేటర్ వరకూ ర్యాలీ జరిగింది. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి, గన్నవరపు మాలలు వేసి, నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మందపాటి కిరణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, విత్తనాల శేఖర్, రాష్ట్ర నాయకులు పి.కె. రావు, అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దొమ్మేటి వెంకటశివరామన్, పితాని నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ

మలికిపురం: కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ రాజోలు నియోజకవర్గం బీజేపీ ఆధ్వర్యంలో మలికిపురం గాంధీబొమ్మలు కూడలి నుంచి కాలేజీ వరకు ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ పహల్గంలో పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపిన ఘటన హేయమైందని ఆయన అన్నారు. ఈ ఘటనను ప్రతి భారతీయుడు ఖండించాలని కోరారు. నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు మేడిచర్ల చాణిక్య, ఇందుకూరి అచ్యుత రామరాజు, కొమరగిరి శ్రీనివాస్, చంపాటి శివరామకష్ణంరాజు, గొల్లమందలు నిరంజన్ రావు, కంచి నాగేశ్వరరావు, మాణిక్యాలరావు, అడబాల వెంకన్నబాబు, ఆరేటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి దోషులను కఠినంగా శిక్షించి, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అఖిల పక్షం నాయకులు అన్నారు. ఈ దాడిలో చనిపోయిన వారికి శాంతి చేకూరాలని అంబాజీపేట అఖిల పక్షం ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రదాడిలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మశాంతి చేకూరాలని రెండు నిమషాలు మౌనం పాటించి శాంతి ర్యాలీ నిర్వహించారు. అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

మలికిపురం: ఉగ్రవాదం అంతమొందాల్సిందేనని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. గురువారం మలికిపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. కాశ్మీర్‌లో నరమేధం సృష్టించిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ర్యాలీలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరా మల్లిబాబు,దొంగ నాగ సత్యనారాయణ, నల్లి డేవిడ్, సూరిశెట్టి బాబి, కుసుమ చంద్రశేఖర్, తోటి జాన్ బాబు, గుబ్బల వీర వెంకట సత్యనారాయణ, ఈద రవి రెడ్డి, పెదపాటి నాగ లక్ష్మి, ముప్పర్తి బాబూరావు, కొల్లాబత్తుల సతీష్ బాబు, జిల్లెళ్ళ ఉదయ్ కిరణ్, నల్లి రక్షణ తదదితరులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులకు నిరసనగా గురువారం స్థానిక సెంటర్లో అఖిలపక్ష నాయకులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. సఖినేటిపల్లి మూడు రోడ్లు సెంటర్ నుంచి ప్రధాన రహదారి వెంబడి నాయకులు ఈ ర్యాలీ చేశారు. గ్రామ సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, ఎంపీపీ వీరా మల్లిబాబు, వైస్ ఎంపీపీ–1 కొల్లాబత్తుల నాని, మాలే శ్రీనివాస నగేష్, సరెళ్ల విజయ్ ప్రసాద్, చెంపాటి శివరామకృష్ణంరాజు, పోతురాజు సురేష్, అయినవిల్లి సత్యనారాయణ, నామన నాగభూషణం, ఇందుకూరి రమేష్ రాజు, అడబాల రాంబాబు, ఇందుకూరి సుబ్బరాజు పాల్గొన్నారు.

ఆలమూరు: కాశ్మీర్ ఘటనను నిరసిస్తూ పెదపళ్లలో అఖిల పక్ష పార్టీ నేతల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అసువులు బాసిన 28 మంది పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని కొద్దిసేపు మౌనం పాటించారు.